క్లుప్తంగా

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి

హిందూపురం టౌన్: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సీట్ల సంఖ్యను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి మూడు, నాలుగు అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో అన్ని తరగతులకు సీట్ల సంఖ్య పెంచాలన్నారు. అలాగే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగడానికి నీరు, హాస్టల్‌కు సన్నబియ్యం సమకూర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ నాయకులు రాజా, మహేష్, నాగేంద్ర, జశ్వంత్, దిలీప్, నరేష్, గోవిందు, హరి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రం

మడకశిరరూరల్: మండలంలోని కదిరేపల్లి పంచాయతీలోని తాగునీటి ట్యాంకులను శనివారం శుభ్రం చేయించినట్లు సర్పంచ్ నర్సేగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అతిసార, సీజనల్ వ్యాధులకు గురికాకుండా ముందు జాగ్రత్తగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సేగౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీరలింగేశ్వరుడి జాతర

పావగడ: తాలూకాలోని రాయచెర్లు గ్రామంలో ఆదివారం, సోమవారం బీరలింగేశ్వర స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి అధ్యక్షుడు ఆర్‌ఓ సాంమసదాశివరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీరలింగేశ్వర స్వామి, రాచెర్లప్ప, ముష్టెల్లప్ప స్వామి నూతన విగ్రహాలను ప్రతిష్టిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాగినెలె మహా సంస్థాన కనక గురు పీఠాధిపతి ఈశ్వరానందపురి మహాస్వామిజీ వస్తారని పేర్కొన్నారు. అదే విధంగా పంచ గ్యారంటీల పథకం అమలు సమితి అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ, ఎమ్మెల్యే వెంకటేశ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కర్ణాటకతో పాటు ఆంధ్రలోని పెనుగొండ, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు చెందిన గుడికట్టు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

వీరభద్రుడి సేవలో రైల్వే ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీని సత్కరిస్తున్న అధికారులు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో స్వామిని దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్‌ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ కమిషనర్ ఆరోమా సింగ్ ఠాకూర్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గాదేవి, పాపనాశేశ్వర, రఘునాథస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం దేవదాయ శాఖ అధికారులు ఆమెను ఘనంగా సత్కరించారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: రాష్ట్రంలో జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జాతీయ విద్యా విధానం రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ఆ విధానంపై మరింత దూకుడుగా ఆరు బడులకు బదులుగా తొమ్మిది రకాల బడులు విధానాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. దీని వల్ల మారుమూల గ్రామాల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు. వెంటనే జాతీయ విద్యా విధానంను రద్దు చేసి, ప్రభుత్వ బడులను ఆధునీకరణ చేసి, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే ఉచిత ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- రోడ్లపై పశువుల సంచారం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు



మండల పరిషత్ కార్యాలయ సమీపంలో రోడ్డు మధ్యలో సంచరిస్తున్న పశువులు



జూనియర్ కళాశాల ఎదురుగా..

పెనుకొండ రూరల్: పట్టణంలో రోడ్లపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరిగి ఏకంగా ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు రోడ్లపై తిరగాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం పశువులు రోడ్లపైనే ఉండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

రోడ్లపైనే తిష్ట..

పట్టణంలోని రోడ్లను పశువులు తమ ఆవాసాలు మార్చుకున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపైనే తిష్ట వేస్తుంటాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఒక్కోసారి పశువులు రోడ్లపైనే పోట్లాటకు దిగి దుకాణాలు, మనుషులపైకి దూసుకుపోతున్నాయి. ఇలాంటి ఘటనల్లో చాలామందికి గాయాలు కూడా అయ్యాయి. ఇటీవల పట్టణానికి చెందిన భార్యాభర్తలు బైక్‌పై దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జర్నలిస్ట్ కాలనీ వద్ద ఉన్నఫలంగా పశువులు అడ్డురావడంతో వారిద్దరూ బైక్‌పై నుంచి పడిపోయారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్య అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్రగాయాలయ్యాయి. సోమందేపల్లి నుంచి బైక్‌పై వస్తున్న ఓ యువకుడు మిట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద పశువులు మీదకు రావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇలాంటి ఘటనలు కోకొల్లలు.

వారపుసంతలో బుల్‌ఫైట్

గత ఆదివారం పట్టణంలోని వారపు సంతలో రెండు ఎద్దులు మధ్య పోట్లాట జరిగింది. దాదాపుగా అరగంట పైబడి ఎద్దులు తీవ్రంగా పోట్లాడుకోవడంతో అక్కడున్న వ్యాపారులు, ప్రజలు భీతిల్లిపోయారు. ఆకుకూరల దుకాణంలోకి దూసుకెళ్లడంతో సరకుంతా ధ్వంసమైంది. ఆ తర్వాత పక్కనే ఉన్న దుకాణం అద్దాలు, డోర్లు ధ్వంసమయ్యాయి. పరిస్థితిని ముందు ఊహించిన కొందరు వ్యాపారులు ముందే దుకాణాలను మూసేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రోడ్లపై పశువుల సంచారంతో జనాలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



ప్రధాన రహదారులపై పశువుల బెడదతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. దారికి అడ్డంగా పశువులు పడుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు పశువులు రోడ్లపై తరచూ పోట్లాడుతుండటంతో మహిళలు ఒంటరిగా బయటకు రావాలంటా భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

–బాబావలి, సీఐటీయూ మండల కన్వీనర్

దుకాణాల్లోకి చొరబడుతున్నాయి



నిరంతరం పశువులు రోడ్లపైనే సంచరిస్తుంటాయి. బస్టాండ్ల వద్ద ప్రయాణికులు నిలబడాలంటానే ఇబ్బందిగా మారుతోంది. పశువులు పోట్లాటకు దిగి దుకాణాల్లోకి దూసుకొస్తున్నాయి. పశువుల సంచారంతో పట్టణంలో ద్విచక్రవాహనాల్లో తిరగాలంటేనే భయమేస్తోంది. అధికారులు స్పందించి రోడ్లపై పశు సంచారాన్ని అరికట్టాలి.

–చెన్నకేశవులు, ఫర్టిలైజర్ షాపు యజమాని

పశు యజమానులకు నోటీసులు ఇచ్చాం



బహిరంగ ప్రదేశాల్లో సంచరించే పశువుల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. రోడ్లపై పశువులు సంచరించకుండా త్వరలో పటిష్టమైన చర్యలు చేపడతాం. బహిరంగ ప్రదేశాలలో సంచరించే పశువులను గోశాలకు తరలించే దిశగా ప్రయత్నిస్తున్నాం.

–సతీష్, నగర పంచాయితీ కమిషనర్, పెనుకొండ

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం

పరిగి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ముందుగా ఈఓఆర్డీ శ్రీధర్ మృతికి సభ్యులు సంతాపం తెలియజేశారు. తర్వాత అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. పొజిషన్ సర్టిఫికెట్ కోసం 400 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. ఊటుకూరులో పీహెచ్‌సీకి శాశ్వత స్థలంతో పాటూ భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూబి తెలిపారు. ప్రస్తుతం ఉన్న భవనానికి నీళ్లు, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసక్తి ఉన్న రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 16 రకాల పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీఓ అప్పస్వామి నాయుడు తెలిపారు. పెయ్య దూడల జననం కోసం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ప్రత్యేక టెక్నాలజీ వినియోగంలోకి వచ్చిందని వెటర్నరీ ఆఫీసర్ సుబ్బరాయుడు పేర్కొన్నారు. స్వయం సంఘాల సభ్యుల ఆర్థిక బలోపేతానికి ఓఎస్‌ఎఫ్(వన్ స్టాప్ ఫెసిలిటేష్) పథకం ప్రస్తుతం అమల్లో ఉందని ఏపీఎం రామేశ్వరరెడ్డి తెలిపారు. పరిగి, సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. వైస్ ఎంపీపీ వేదవతి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఏఓ విజయభారతి, ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప, పీఆర్ ఏఈ నాగన్న, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ ఫలితాల్లో విజయకేతనం

హిందూపురం టౌన్: ఏపీ ఈసెట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ హరీష్ బాబు శనివారం తెలిపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. కళాశాల ఫార్మసీ విభాగం నుంచి యం.ఎస్.జవేరియా తాసీన్ (4), పల్లవి (11), శృతి(25), లతశ్రీ (27), లిఖిత (39), పూజిత(50), హేమప్రియ (60), షేక్ ఆర్షియా (121), రేష్మ (126), షబ్నమ్ (171), అర్ఫనా బాను (200), జూబేద (248), సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఈ.మణికుమారి (180), సారియా ఫిర్దోస్ (254), శైలజ (668) అలాగే ఈసీఈ విభాగం నుంచి డీ.లక్ష్మీ (342), అక్షిత (581), హిమ వర్షిణి (721), మేఘన (741), లహరి(754) ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

యువత మానసికంగా దృఢంగా ఉండాలి



బాడిబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన యువతను అభినందిస్తున్న డీఎస్పీ మహేష్, మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్

హిందూపురం: యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని డీఎస్పీ మహేష్, మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ సూచించారు. మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ బాడీ బిల్డింగ్ ఫిజిక్ స్పోర్ట్స్ మాస్టర్ చాంపియన్ షిప్–2025 కదిరిలో జరిగిన పోటీల్లో హిందూపురం యువకులు నలుగురు ప్రతిభను చాటారు. మెన్ ఫిజిక్ పోటీలో షబ్బీర్,అభిషేక్ రెండోస్థానం, బాడీ బిల్డింగ్ పోటీలో రిజ్వాన్ మూడో స్థానం, ఇమ్రాన్ నాలుగో స్థానం దక్కించుకున్నారు. పోటీల్లో ప్రతిభ చాటుకున్న యువతను డీఎస్పీ, మున్సిపల్ చైర్మన్ సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్ నాయుడు, మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, కౌన్సిలర్ ఇర్షాద్, జిమ్ నిర్వాహకులు షఫీ, సమీవుల్లా, జిబివుల్లా, సల్మాన్, ఇలియాజ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ సాదర క్షేమాభివృద్ధి సంఘం ఎన్నిక

రొళ్ల: మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ స్థాయి సాదర క్షేమాభివృద్ధి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా డి.రంగారెడ్డి (గుడ్డగుర్కి), ఉపాధ్యక్షుడిగా ఎస్.పీ.దయానంద్ (బీచిగానపల్లి), కార్యదర్శిగా ఆర్.ఎం.నాగేంద్ర (రొళ్ల), ట్రెజరర్‌గా ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి (సోమందేపల్లి), ఈసీ మెంబర్లుగా కే.టీ.నాగేంద్ర (కాకి) కె.రంగనాథ్ (గొల్లాపురం), ఎస్.శైలజ (గొరవనహళ్లి), శ్రీనివాసులు (మడకశిర), పీ.ఎస్.జగదీష్ (చాలకూరు), కే.ఆర్.లక్ష్మి (జూలుకుంట), పీ.ఎం.రవికుమార్ (గొరవనహళ్లి), ఈ.చంద్రశేఖర్ (శిరివరం), జి.గోపినాథ్ (టెంపుల్ కాలనీ), శ్రీనివాస్ సాదర (అగళి), డీ.ఆర్.జ్యోతి (దొడ్డేరి), శ్రీనివాసులు (సోమందేపల్లి) ఎన్నుకున్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భగా ఉదయం వేదపండితులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అంతకుముందు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న హిందూ సురక్ష సేవా సమితి నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలో ఈ నెల 22న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హిందూ సురక్ష సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయాలని హిందూ సురక్ష సేవాసమితి నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హిందువుల్లో భక్తి భావం, ఆధ్యాత్మిక చింతన, దేశ రక్షణ, దేశభక్తి పొందించడానికి హనుమాన్ శోభాయాత్ర దోహదపడుతుందన్నారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా ప్రధాన వీధుల్లో హనుమాన్ శోభాయాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో హిందూ సురక్ష సేవా సమితి సభ్యులు బిఎస్ విద్యాసాగర్, చారుకీర్తి, సురువు రామాంజనేయులు, రమేష్ రెడ్డి, మేడికుర్తి హరి, పార్థసారధి, ఆదర్శ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సభ్యుడిగా కృష్ణమూర్తి

పావగడ: తాలూకాలోని కన్నమేడి గ్రామ పంచాయతీ సభ్యుడిగా కిలార్లహళ్లి ఎస్.కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత సభ్యుడి మృతితో ఖాళీగా ఉన్న సభ్యత్వ స్థానానికి శనివారం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో సభ్యత్వ స్థానానికి 5 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నలుగురు తమ నామినేషన్లు ఉప సంహరించుకోవడంతో కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడిని కిలార్లహళ్లి గ్రామస్తులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టె, నీటి కుంటలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి ఏపీడీ శివానందనాయక్, పశువైద్య సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం సూచించారు. ఉపాధి పథకం ద్వారా మంజూరైన పశువుల నీటి తొట్టె, నీటికుంటలను బేవనహళ్లి పంచాయతీలో ఏపీడీ ప్రారంభించారు కార్యక్రమంలో ఏపీఓ లలితకుమారి, ఎంపీటీసీ అశ్విని, నాగరాజు, నాయకులు మారుతి, చంద్ర, సోమయ్య, నరసింహామూర్తి, ఆయకట్టు డైరెక్టర్ .గోపాలప్ప, రైతులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కూటమి సభ్యుడు డాక్టర్ బసవరాజు తెలిపారు. ఈ శిబిరానికి చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతి, సామాన్య వ్యాధి నిపుణుడు ఓంకార్ నాయక్, నేత్ర నిపుణుడు జింకా కృష్ణమోహన్ హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్‌కు మాతృవియోగం



నాగమ్మ(ఫైల్)

పరిగి: వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జయరాంకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి నాగమ్మ(100) వయసు పైబడిన రీత్యా శనివారం చిన్నపల్లిలోని ఇంట్లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఫోన్‌లో జయరామ్‌ను పరామర్శించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ చిన్నపల్లికి విచ్చేసి జయరామ్ తల్లి నాగమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఎంపీపీ సవిత, బీసీ సెల్ జిల్లా నేత ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప ఉన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

గోరంట్ల: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో తిరంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఆపరేషన్ సిందూర్ విజయంతంగా నిర్వహించిన త్రివిధ దళాలకు అభినందనలు తెలియజేశారు. యుద్ధంలో మృతి చెందిన జవాన్లకు నివాళులర్పించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పావగడ: తాలూకాలోని బీకే హళ్లి గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ 5వ వార్షిక వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు సాయిబాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో షిర్డీ సాయి ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఈరప్ప రెడ్డి, డైరెక్టర్లు గోపాల శెట్టి, మల్లేశ్, శివారెడ్డి, అక్కులప్ప, సుబ్రహ్మణ్యం, హనుమంత రెడ్డి, మంజునాథ్, జనార్దన్, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈరగార స్వామి విగ్రహ ప్రతిష్టాపన

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో శనివారం ఈరగార స్వామి విగ్రహ ప్రతిష్టాపన వైభవంగా జరిగింది. బాగేపల్లి శివానందయోగి స్వామిజీ సారథ్యంలో కలశ ప్రతిష్టాపన, ప్రతిష్ట హోమం, అభిషేకం, అష్టోత్తర పూజ, పూర్ణాహుతి చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురంటౌన్/హిందూపురం/మడకశిరరూరల్/అగళి/అమరాపురం/పెనుకొండ/సోమందేపల్లి/గోరంట్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. శనివారం హిందూపురం పట్టణంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర, బీట్ ది హీట్‌ను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అలాగే ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ అలివేలమ్మ, ఏసీపీ చంద్రమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, డీఎంసీ గంగులయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే హిందూపురం మండలంలోని బేవినాహళ్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి దీపక్ కుమార్ అధ్యక్షతన శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువైద్య సహాయకుడు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

– ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాలుకా స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం అధికారులతో కలిసి మడకశిర మండలం కల్లుమర్రిలో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, ఏఓ శ్రీనివాసరావు, కార్యదర్శి వరదరాజులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే అమరాపురం, అగళిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

– ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జేడీ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సోమందేపల్లి , గోరంట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

అమరాపురం: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయ ఆవరణలో శనివారం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఏఓ మంజునాథ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గతంలో బోదుగుంటక, స్ప్రేయర్లు, మడకలు, విత్తనం గొర్రు, బ్రష్‌కట్టర్లు, పవర్ వీడర్ కోసం నగదు చెల్లించిన రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా వచ్చిన పనిముట్లను అందజేశారు. ఈ పనిముట్లను ఉపయోగించుకుని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అమర్నాథ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఎస్పీ, కేవీపీఎస్ నాయకులు, ప్రజలు

హిందూపురం: ఆర్డీటీ సేవలను కొనసాగించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి శ్రీరాములు డిమాండ్‌రు. ఆర్డీటీ సేవలను కొనసాగించాలంటూ శనివారం బీఎస్పీ కార్యకర్తలు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ హిందూపురం తహసీల్దార్ కార్యాలయం ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేద ప్రజల కోసం విద్య, వైద్యం, తాగునీరు, గృహ నిర్మాణాలు, క్రీడల్లో ఆర్డీటీ విశేష సేవలందిస్తున్నారు. మానవత్వమే మతంగా సేవలందిచిన సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమరేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మౌలాలి, సుబ్బరాయప్ప, ఫక్రుద్దీన్, నరసింహప్ప, నారాయణస్వామి, వెంకటేష్, మారుతి, అంజినప్ప, కేవీపీఎస్ నాయకుడు రమణ, మహిళలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్



ఫైలుపై సంతకం పెడుతున్న సీఎం సిద్ధరామయ్య

పావగడ: తాలూకాలోని 23 చెరువులకు నీరు అందించేందుకు ఎత్తినహొళె (ఎత్తిపోతల) పథకానికి కావాల్సిన నిధులు సమకూర్చాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్, అతడి తండ్రి, మాజీ మంత్రి వెంకటరమణప్ప శనివారం సీఎం సిద్ధరామయ్యను కలసి విన్నవించుకున్నారు. స్పందించిన సీఎం.. వెంటనే ఎత్తినహొళె యోజనకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని చిన్న నీటి పారుదల శాఖకు లేఖ రాశారు. అనంతరం పావగడ మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులకు రూ.25 కోట్ల నిధులను అందించాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సీఎంను కోరారు. తప్పక అందిస్తామని సీఎం సిద్ధరామయ్య భరోసా ఇచ్చారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం వద్ద దాతల సహకారంతో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన కురుబ మల్లేపల్లి శంకరప్ప కుమారుడు మంజునాథ్ రూ.25 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు సత్కరించారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా A. అంజినమ్మ, W/o A. లక్ష్మిరెడ్డి, దుర్గానగర్, సోమందేపల్లి (గ్రా॥), సోమందేపల్లి పొలం మరియు పంచాయతీ పరిధిలో S.No. 53 లో (53-4) 1B ప్రకారం 3.28 సెంట్లు పైకి 2.4 సెంట్లు పైకి 6 సెంట్లు స్థలం ఇదే గ్రామానికి చెందిన H.Mahammad Budden Sab మరియు Y. Nagamadhusudhan Rao నుండి 23-05-2024వ తేదీన రిజిస్టర్ విక్రయం పొంది హక్కు అనుభవం కలిగి వున్నారు. అయితే H.Mahammad Budden Sab మరియు Y. Nagamadhusudhan Rao లు Mahendra Sing మరియు K.Meera Sing లతో అన్ని విక్రయాలు పొందిన Original పత్రం తేది 19-11-2020 (డాక్యుమెంట్ నం. 3043/2020) 3-5-2025వ తేదీన మధ్యాహ్నం A.అంజినమ్మ, సోమందేపల్లి లోని జిరాక్స్ సెంటర్ నుండి పెనుకొండకు మోటార్‌సైకిల్‌లో వెలుతుండగా పోగొట్టుకున్నారు. దీనిపై సోమందేపల్లి పోలీస్ స్టేషన్ నందు కంప్లైంట్ చేసినారు, మరియు విశాలాంధ్ర దినపత్రికలో 07-05-2025వ తేదీన ప్రకటన కూడా వేసినారు. అయితే ఎంత వెతికిననూ సదరు పత్రం లభించలేదు. సోమందేపల్లి పోలీస్ వారు సర్టిఫికేట్ కూడా జారిచేసినారు.

కావున సదరి ఆస్తిపై A. అంజినమ్మ, మాగేచెరువు, కెనరా బ్యాంక్‌లో రుణ సహాయం నిమిత్తం అర్జీ పెట్టుకొన్నారు. సదరి అర్జీ పట్ల ఎలాంటి అభ్యంతరాలు వున్న యెడల ఒక వారం రోజులలోపు తెలుపుకొనవచ్చును మరియు విక్రయ పత్రం (డాక్యుమెంట్ నెం. 3043/2020), తేది 03-05-2025 ఎవరికైన లభించిన సదరి బ్యాంకు వారికి అందజేయవలెయును.

Md. ASIF, Advocate, Penukonda, Cell: 9440248016